సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 20 । నవంబర్ । 2023



'కారు'తోనే వెలుగులు

బీఆర్‌ఎస్‌తోనే నియోజకవర్గంలో వెలుగులు నిండాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 10లో▸



అవ్వా.. ఓటు అభయమివ్వవా..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ అవ్వను ఓటు అభ్యర్థిస్తున్న కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి



చాయ్ అందిస్తా.. ఓటు పట్టేస్తా

ప్రచారంలో భాగంగా మీర్‌పేటలో చాయ్ అమ్ముతూ ఓటు అభ్యర్థిస్తున్న మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్



ఇస్త్రీ.. ఓట్ల కోసం కుస్తీ

శంకర్‌పల్లి మండలంలో ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య

న్యూస్‌రీల్

ఉత్సాహంగా గ్రీన్ కాన్హా రన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గురూజీ కమ్లేష్ పటేల్

నందిగామ: మండల పరిధిలోని కాన్హా శాంతి వనం హార్ట్‌ఫుల్ నెస్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రీన్ కాన్హా రన్ ఉత్సాహంగా సాగింది. హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ గ్రాన్యూల్స్ ఇండియాతో కలిసి చేపట్టిన కార్యక్రమంలో సుమారు 3 వేల మంది పలు కేటగిరీల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్లలో నిర్వహించినట్లు, ప్రపంచవ్యాప్తంగా సుమారు 13వేల మంది ఈ రన్‌కు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. కాన్హాలో నిర్వహించిన రన్‌లో విజేతలకు కాన్హా శాంతి వనం గురూజీ కమ్లేష్ పటేల్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రతీక్ శ్రీ వాత్సవ్, నందిని ఆగస్త్యా, ప్రతిమ పటేల్, అనిల్ ఆరోరా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు వీఆర్‌ఎస్ ఖాయం


యువజన కాంగ్రెస్ జాతీయ మీడియా కోఆర్డినేటర్ చేతన్ గోనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న చేతన్ గోనాయక్

తుక్కుగూడ: రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీకి వీఆర్‌ఎస్ ఖాయమని జాతీయ యవజన కాంగ్రెస్ పార్టీ మీడియా కోఆర్డినేటర్ చేతన్ గోనాయక్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పదేళ్ల కాలంలో అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలను దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. మహేశ్వరం నియోజకవర్గ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎల్‌ఆర్‌ను హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి కేఎల్‌ఆర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మీడియా చైర్మన్ శైలేందర్, నాయకులు కప్పాటి శివరామకృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, హమూది, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్‌గా అర్జున్



హనుమంతుల అర్జున్

కందుకూరు: పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కందుకూరుకు చెందిన లాయర్ హనుమంతుల అర్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం పీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీ ఆయనకు నియామక పత్రం అందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు అర్జున్ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు మరో 84

- 1,500 ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల గుర్తింపు
- గతంలో 3,369.. ప్రస్తుతం 3,453 సెంటర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్త ఓటర్లు జిల్లాలో భారీగా నమోదయ్యారు. సాధారణంగా ఒక్కో పోలింగ్ కేంద్రంలో పరిధిలో 1,300 నుంచి 1,500 ఓట్లను కేటాయించారు. ఎన్నికల కమిషన్ అక్టోబర్ 4న ఓటర్ల తుది ముసాయిదాను విడుదల చేసింది. ఆ తర్వాత కూడా ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించింది. నవంబర్ 11న మళ్లీ ఓటర్ల తుది జాబితా వెల్లడించింది. ఈ నెల రోజుల వ్యవధిలోనే కొత్తగా 1,67,163 మంది ఓటర్లు వచ్చి చేరారు. ఈవీఎం మిషన్ల సామర్థ్యానికి మించి (1,500) ఓటర్లున్న పోలింగ్ బూతుల పరిధిలో అదనపు పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నంలో 24, ఎల్బీ నగర్‌లో మూడు, మహేశ్వరంలో 31, రాజేంద్రనగర్‌లో ఏడు, శేరిలింగంపల్లిలో 16, షాద్‌నగర్‌లో మూడు చొప్పున అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాదు అక్టోబర్ నాలుగు నాటికి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 3,369 పోలింగ్ సెంటర్లు ఉండగా, వీటి పరిధిలో 33,56,056 మంది ఓటర్లు ఉన్నారు. నవంబర్ 11 నాటికి ఓటర్ల సంఖ్య 35,22,420కి చేరింది. పోలింగ్ బూతుల సంఖ్యను 3,369 నుంచి 3,453కి పెంచాల్సి వచ్చింది. అదనంగా 84 ఏర్పాటు చేశారు.

అక్టోబర్.. నవంబర్‌లో..

- ఇబ్రహీంపట్నంలో గతంలో 3,10,756 మంది ఓటర్లు ఉండగా, కొత్తగా 16,901 మంది ఓటు హక్కు పొందారు. ప్రస్తుతం వీరి సంఖ్య 3,27,657కు చేరింది.



- ఎల్బీనగర్‌లో గతంలో 5,65,576 మంది ఓటర్లు ఉండగా, కొత్తగా 26,698 మంది ఓటు హక్కు పొందగా, ప్రస్తుతం వీరి సంఖ్య 5,93,774కు చేరింది.
- మహేశ్వరంలో గతంలో 5,17,376 మంది ఓటర్లు ఉండగా, కొత్తగా 29,337 మంది ఓటు హక్కు పొందగా, వీరి సంఖ్య 5,46,713కు చేరింది.
- రాజేంద్రనగర్‌లో గతంలో 5,52,535 మంది ఓటర్లు ఉండగా, కొత్తగా 29,579 మంది ఓటు హక్కు పొందారు. ప్రస్తుతం వీరి సంఖ్య 5,82,114కు చేరింది.
- శేరిలింగంపల్లిలో గతంలో 6,98154 మంది ఓటర్లు ఉండగా, కొత్తగా 3,44,33 మంది ఓటు హక్కు పొందగా ప్రస్తుతం వీరి సంఖ్య 7,32,587కు చేరుకుంది.

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గం	అక్టోబర్ వరకు	ప్రస్తుతం
ఇబ్రహీంపట్నం	319	345
ఎల్బీనగర్	570	573
మహేశ్వరం	511	542
రాజేంద్రనగర్	535	542
శేరిలింగంపల్లి	622	638
చేవెళ్ల	298	298
కల్వకుర్తి	262	262
షాద్‌నగర్	252	255

- చేవెళ్లలో గతంలో 2,54,050 మంది ఓటర్లు ఉండగా, కొత్తగా 8,034 మంది ఓటు హక్కు పొందగా, ప్రస్తుతం వీరి సంఖ్య 2,62,094కు చేరింది.
- కల్వకుర్తిలో గతంలో 2,30,785 మంది ఓటర్లు ఉండగా, కొత్తగా 11,113 మంది ఓటు హక్కు పొందగా, ప్రస్తుతం వీరి సంఖ్య 2,41,898కి చేరింది.
- షాద్‌నగర్‌లో గతంలో 2,25,524 మంది ఓటర్లు ఉండగా, కొత్తగా 1,08,68 మంది ఓటు హక్కు పొందగా, ప్రస్తుతం వీరి సంఖ్య 2,36,392కి చేరింది.



దున్న.. గెలిపించవన్నా

నందిగామ మండలంలో ప్రచారం చేస్తూ దున్నకు దండం పెడుతున్న షాద్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలి

విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి

ఆమనగల్లు: రాష్ట్రంలో అవినీతి, నియంతృత్వ పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌ను.. కేంద్రంలో అసమర్థత, మత విద్వేషపూరిత ఫాసిస్ట్ పాలన సాగిస్తున్న బీజేపీని ఓడించాలని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. కేసీఆర్, మోదీలకు మద్దతిస్తే ప్రజలు బతుకులు ఆగమవుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్యవేదిక, జాగో తెలంగాణ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర 19వ రోజు ఆదివారం ఆమనగల్లు పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ కుటుంబం వేలకోట్ల కుంభకోణాలతో తన్నుకుపోయిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్‌భగీరథ పథకాల పేరుతో బీఆర్‌ఎస్ సర్కార్ అడ్డూ అదుపు లేని అవినీతికి పాల్పడిందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీల కోసం పనిచేస్తోందని దుయ్యబట్టారు. ఓట్లు, సీట్ల రాజకీయం చేస్తున్నత బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, పద్మజషా, వినాయక్‌రెడ్డి, నైనాల గోవర్ధన్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

అభ్యర్థుల్లో అంతర్మథనం

- తరుముకొస్తున్న నవంబర్ 30
- ఓటరు నాడిపై తంటాలు
- పోల్ మేనేజ్‌మెంట్‌పైనే ఆశలు
- వచ్చే వారం రోజులూ ఉత్కంఠే



గెలుపోటములపై సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: నవంబర్ 30 తరుముకొస్తోంది. ఎన్నికల ప్రచారానికి ఇక మిగిలింది ఎనిమిది రోజులే. ఇంచుమించు ఈ వారంలోనే ఓటర్లకు మరింత చేరువ కావాలి. ఇప్పటి వరకు ఏ ఓటరు ఏ పార్టీకి జై కొడతాడో తెలియని పరిస్థితి. డబ్బులు, మద్యం, కానుకలు పంపిణీ చేసినా చివరి నిమిషంలో ఓటరు మహాశయుడు ఏ గుర్తుపై మీట నొక్కుతాడో తెలియదు. బరిలో నిలిచిన నేతలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల పాటు వెంట నడిచే అనుచరులు, కార్యకర్తలు, నాయకుల బలాన్ని చూస్తే గెలిచి తీరుతామనే భరోసా కలుగుతోంది. కానీ అంతిమంగా తీర్పు చెప్పాల్సిన ఓటరు మదిలో ఏముందో తెలియదు. ఇదీ కొద్ది రోజులుగా అభ్యర్థులు పడుతున్న అంతర్మథనం. గెలుపోటములపై అన్ని పార్టీల్లో సమీక్షలు మొదలయ్యాయి. ఇప్పటి వరకు ప్రచారం నిర్వహించిన తీరు, రానున్న వారం రోజుల పాటు చేపట్టాల్సిన ప్రచారం వంటి అంశాలపై నాయకులు దృష్టి సారించారు. నవంబర్ 30న జరగనున్న ఎన్నికలకు గడువు సమీపిస్తున్న దృష్ట్యా అన్ని పార్టీల అభ్యర్థుల పోల్ మేనేజ్‌మెంట్‌పై ఆశలు పెట్టుకున్నాయి. సాధారణంగా ఎన్నికల ప్రకటన విడుదలైనప్పటి నుంచి అన్ని పార్టీలు ప్రచారంతో హోరెత్తిస్తాయి. విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తాయి. ఈసారి ప్రచార కార్యక్రమాలకు తోడు సోషల్ మీడియాపై ప్రధానంగా దృష్టి సారించారు. ముఖ్యంగా ఎక్కడికక్కడ వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఓటు బ్యాంకులను సుస్థిరం చేసుకొనేందుకు చర్యలు చేపట్టారు. ఈ వాట్సప్ గ్రూపులు ఈసారి ఎలాంటి ఫలితాన్ని ఇవ్వనున్నాయనేది డిసెంబర్ 3న తేలనుంది.

పోల్ మేనేజ్‌మెంట్‌పైన గురి..

- నియోజకవర్గాలు, డివిజన్‌ల స్థాయిలో ఎన్నికల ప్రచారం ఒక స్థాయికి చేరడంతో ప్రస్తుతం పోల్ 'మేనేజ్‌మెంట్' కోసం అభ్యర్థులు కసరత్తు చేపట్టారు. ఇప్పటికే అన్ని చోట్ల తాయిలాల పంపిణీ మొదలుపెట్టారు. ప్రలోభాలను మరింత ఉద్ధృతం చేసి ఓటర్ల నుంచి గట్టి హామీ పొందేందుకు పోల్ మేనేజ్‌మెంట్ చేపట్టారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌ల వారీగా ఓటర్ల సంఖ్యను లెక్కలు వేసి ఏ ఓటరును ఎలా తమ వైపు తిప్పుకోవాలనే దిశగా పోల్ మేనేజ్‌మెంట్ సాగుతోంది. కొన్ని చోట్ల మహిళలను ఆకట్టుకొనేందుకు కానుకలను సమర్పిస్తుండగా.. మరికొన్ని కొన్ని చోట్ల మద్యం, డబ్బుల పంపిణీ జోరుగా సాగుతోంది.



- 'ప్రచార రథాలు ఏర్పాటు చేసుకొని, కండువాలు కప్పుకొని, జెండాలు ఎగరేసి ఎంత ఉద్ధృతంగా ప్రచారం చేసినా అంతిమంగా తేలాల్సింది ఓటరు దగ్గరే. ఏ ఓటరు ఎటు వైపు ఆలోచిస్తున్నాడనే అంశం ఆధారంగానే పోల్ మేనేజ్‌మెంట్ ఉంటుంది' అని ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ఒకరు అభిప్రాయపడ్డారు. తటస్థులను, విపక్షాలకు దగ్గరయ్యే వారిని తమవైపు తిప్పుకొనేందుకు ఇది ఎంతో కీలకమని చెప్పారు. ప్రతి అభ్యర్థీ తన నియోజకవర్గంలో ఉన్న మొత్తం ఓట్లలో కాలనీలు, బస్తీలవారీగా తమకు పట్టున్న ప్రాంతాలను, ఎక్కువ ఓట్లు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను అంచనా వేస్తున్నారు.బాగా ఆదరణ, పట్టున్న ప్రాంతాలపైనే ఎక్కువ దృష్టి సారించి ప్రచారం కొనసాగిస్తున్నారు.

గుంభనంగా ఓటర్లు..

ఒకవైపు రాజకీయ పార్టీల ప్రచారం, అభ్యర్థుల అంతర్మథనం, గెలుపు ఓటములపై అంచనాల తీరు ఇలా ఉంటే.. ఓటర్లు మాత్రం గుంభనంగా ఉన్నారు. అన్నిచోట్ల ఎన్నికలే ప్రధానంగా చర్చలు జరుగుతున్నాయి. ఏ నలుగురు కలిసినా పార్టీల ప్రచారం పై, అభ్యర్థుల వ్యక్తిత్వాలపై మాట్లాడుకుంటున్నారు. కానీ ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారనే అంశం మాత్రం ఇంకా అస్పష్టంగానే ఉంది. ఎన్నికలకు ఇంకా కొన్ని రోజులు మిగిలి ఉండడంతో ఓటర్లు పార్టీల ప్రచారం పైన తామరాకుమీద నీటి బొట్టులా పారదర్శకంగానే స్పందిస్తున్నారు. బాహాటంగా అభిప్రాయాలను వెల్లడించేందుకు వెనకడుగు వేస్తున్నారు. మరో వైపు మరో నాలుగు రోజులు గడిస్తే తప్ప ఓటర్ల నాడి పట్టుకోవడం సాధ్యం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు.



ఓటేసేనా.. దాటేసేనా!

అంతా విద్యావంతులే.. పోలింగ్ అంతంతే

సాక్షి, సిటీబ్యూరో: విశ్వనగరిగా రూపాంతరం చెందుతున్న హైదరాబాద్‌లో అక్షరాస్యత శాతం తక్కువేమీ కాదు. నగరవాసులు ఎక్కువ శాతం చదువుకున్నవారే. మంచి ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నవారే. అయినా భవిష్యత్తును నిర్ధారించే ఓటుహక్కును మాత్రం వినియోగించడంలో నిరాసక్తత కనబర్చడం విస్మయానికి గురిచేస్తోంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే నగరంలోనే అతి తక్కువగా పోలింగ్ నమోదవుతూ వస్తోంది. గత పర్యాయం 48.89 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో సైతం పురుషులు 49.81 శాతం, మహిళలు 47.90 శాతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక పాతబస్తీలో పోలింగ్ పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. మిగిలిన చోట్ల పోలింగ్ ఓ ఎత్తయితే పాతబస్తీలో ఓటింగ్ మరో ఎత్తు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇక్కడ అంతగా ఆసక్తి కనబర్చకపోవడం గమనార్హం. గత రెండు పర్యాయాల పోలింగ్ పరిశీలిస్తే మొత్తం ఓటర్లలో సగం మంది కూడా పోలింగ్‌లో పాల్గొనకపోవడం ఇందుకు నిదర్శనం. ప్రతిసారీ ఎన్నికల యంత్రాంగం ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నా.. పరిస్థితిలో ఏమాత్రం మార్పు కనిపించడంలేదు. ఇళ్లలో నుంచి బయటికి వచ్చి ఓటేసేందుకు పెద్దగా ఆసక్తిని కనబర్చని పరిస్థితి నెలకొంది.

ఆ ఏడింటిలోనూ అంతంతే..

పాతబస్తీ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఫలితాలు ఒకే విధంగా ఉంటాయి. రాజకీయ పార్టీ ఏదైనా కానీ, ప్రచార మాధ్యమాలు, మరేదైనా కానీ.. పాత బస్తీ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో గెలిచేది ఒకే పార్టీ అన్నది ఘంటాపథంగా చెబుతుంటాయి. ఇదే ఓటింగ్ తగ్గడానికి కారణంగా కనిపిస్తోంది. పెద్దగా పోటీ ఉండదు కాబట్టి ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించేందుకు పెద్దగా ఆసక్తి కనబర్చరు. గత నాలుగు దశాబ్దాలుగా పోలింగ్ మరింత దిగజారుతోంది. పాత నగరానికి, మిగిలిన హైదరాబాద్‌కీ మధ్య స్పష్టమైన తేడా ఉన్నప్పటికీ ఇక్కడ కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నగరంలోని అత్యంత సంపన్న ప్రాంతాలలో ఒకటైన జూబ్లీహిల్స్‌లో సైతం తక్కువగా నమోదు కావడం విశేషం.

శివార్లలోనూ..

నగర శివార్లలో సైతం పోలింగ్ శాతం పెరగడం లేదు. గత పర్యాయం పలు నియోజకవర్గాల్లో తక్కువగా నమోదవుతూ వస్తోంది. ఇక్కడ కూడా మహిళల పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొత్తం మీద 61.29 శాతం, మల్కాజిగిరి-మేడ్చల్ జిల్లాలో సైతం అంతం మాత్రంగా నమోదైంది.

రేపటి నుంచి 'పట్నం'లో హోం ఓటింగ్

ఇబ్రహీంపట్నం: 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు సోమ, మంగళ వారాల్లో హోం ఓటింగ్ ప్రక్రియ చేపడుతున్నట్లు రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో హోం ఓటింగ్ కోసం 170 మంది దరఖాస్తులు చేసుకోగా అందులో 52 మంది అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి ఆయా మండలాల్లో వారి ఇంటి వద్దకు ఉదయం 9గంటల నుంచి 5గంటల సమయంలో ఓటర్స్‌ను కలుస్తారని చెప్పారు.

మండలాల వారీగా అర్హుల వివరాలు


మండలం	అర్హులు
యాచారం	19
మంచాల	10
ఇబ్రహీంపట్నం	12
అబ్దుల్లాపూర్‌మెట్	11

హోం ఓటింగ్‌కు 330 మంది దరఖాస్తు

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలో 80 ఏళ్లు దాటిన వృద్ధులతో పాటు వికలాంగులు ఫామ్–12డీ ప్రకారం 330 మంది దరఖాస్తు చేసుకున్నారని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు. సోమ, మంగళవారాల్లో రెండు రోజులు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికెళ్లి ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి 6 ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టీమ్‌లో సెక్టోరల్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్, పోలీసు అధికారి, మైక్రో అబ్జర్వర్, వీడియో గ్రాఫర్ ఉంటారన్నారు. ఓటుహక్కును వినియోగించుకునే వారిని వీడియోను చిత్రీకరిస్తామన్నారు. రెండ్రోజుల పాటు 330 మంది ఇళ్ల వద్దకు వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం 12–డీ ఫామ్ అందజేసి దరఖాస్తులను స్వీకరించామన్నారు. వాటిని పరిశీలించిన అనంతరం 330 మందికి ఈ అవకాశం అందించినట్లు స్పష్టం చేశారు.

సైకిల్

టీడీపీ పూర్తిగా డీలా పడుతోంది. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన నాటి నుంచి 'పట్నం' ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీలో ఎదిగిన నేతలంతా సైకిల్ దిగి 'కారు', కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంతో తెలుగు తమ్ముళ్లు సైతం అదేబాటలో నడుస్తున్నారు.



- అధినేత నిర్ణయంతో ఆగమైన కార్యకర్తలు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ కేడర్



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో టీడీపీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. సాధారణ కార్యకర్తలే ఆ పార్టీకి బలమైన ఆధారం. 1952 నుంచి 1983 వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకే ఇక్కడి ప్రజలు పట్టం కట్టారు. 1983లో ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హవా కొనసాగింది. ఇలాంటి సమయంలో కూడా పట్నం ఓటర్లు హస్తం పార్టీకే పట్టం కట్టారు. అయితే అనూహ్యంగా ఆ పార్టీకి 1985 ఎన్నికల్లో చెక్ పెట్టారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కొండ్రు పుష్పలీల ఎమ్మెల్యేగా గెలిచి.. ఎన్టీఆర్ కేబినెట్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో కాంగ్రెస్ మద్దతుతో సీపీఎం అభ్యర్థి మస్కు నర్సింహ విజయం సాధించారు.

తలపడిన 'కారు', 'ఏనుగు'.. మూడోస్థానానికి పరిమితమైన 'సైకిల్'

నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009, 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో టీఆర్‌ఎస్ అధికార పగ్గాలు చేపట్టింది. అప్పటివరకు టీడీపీలో కొనసాగిన కిషన్‌రెడ్డి 2015లో బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో టీడీపీ పరిస్థితి నావికుడు లేని పడవలా తయారైంది. 2018 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, టీడీపీ నాయకులు మహాకూటమిగా ఏర్పడ్డారు. పొత్తులో భాగంగా ఈ ఎన్నికల్లో సామ రంగారెడ్డిని టీడీపీ బరిలోకి దింపింది. అయితే కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన మల్‌రెడ్డి రంగారెడ్డి బీఎస్పీ నుంచి పోటీ చేశారు. కిషన్‌రెడ్డి, రంగారెడ్డి నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. కేవలం 356 ఓట్ల మెజార్టీతో కిషన్‌రెడ్డి గెలుపొందారు. మహాకూటమి అభ్యర్థి రంగారెడ్డి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు.

పోటీకి దూరం

టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయంతో ఈ ఎన్నికల్లో పోటీకి పార్టీ దూరంగా ఉంది. దీంతో పార్టీ శ్రేణులు గందరగోళానికి గురయ్యారు. అధినేత నిర్ణయంతో కేడర్ చెల్లాచెదురయింది. పోటీ నుంచి తప్పుకున్నారు సరే.. ఎవరికి మద్దతివ్వాలో స్పష్టమైన ఆదేశాలివ్వకపోవడంతో కార్యకర్తలు బిక్కమొకం వేశారు. టీడీపీ పరిస్థితిని గమనించిన బీఆర్‌ఎస్ నాయకత్వం కొంద మందికి గులాబీ కండువా కప్పింది. మరికొందరు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. పార్టీని నడిపించే సారథి లేకపోవడంతో ఆపార్టీ నియోజకవర్గంలో చతికిల పడింది.

బొమ్మ పడుద్ది!

- తాయిలాలపై పార్టీ గుర్తులు, అభ్యర్థుల ఫొటోలు
- పోలీసు, వాణిజ్య పన్నుల శాఖ తనిఖీలు
- ఆయా వస్తువుల వ్యయం అభ్యర్థుల ఖర్చులోనే జమ

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలు వస్తే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తాయిలాలు, హామీల వర్షం కురిపిస్తుంటారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రలోభాలతో మచ్చిక చేసుకుంటారు. బహుమతులు, గిఫ్టులు, తాయిలాలపై ఎన్నికల సంఘం పటిష్ట నిఘా పెట్టింది. నాయకులు ఓటర్లకు అందించే రకరకాల వస్తువుల జాబితాను సిద్ధం చేసింది.

26 వస్తువుల జాబితా ఇదే..

ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నిఘా పెంచింది. రాజకీయ నాయకుల బొమ్మలు, పార్టీ గుర్తులు కలిగిన బెడ్ షీట్లు, టవళ్లు, సైకిళ్లు, మోటారు సైకిళ్లు, సీలింగ్ ఫ్యాన్లు, కాస్మోటిక్స్, క్రికెట్ కిట్లు, జిమ్ పరికరాలు, కుంకుమ భరిణిలు, మిక్సీలు, మొబైల్ ఫోన్లు, రెడీమేడ్ దుస్తులు, చీరలు, పాఠశాల బ్యాగ్‌లు, కుట్టు మిషన్లు, స్టీల్ వస్తువులు, టీ షర్టులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, టీవీ సెట్లు, బొమ్మలు, ట్రావెల్ బ్యాగ్‌లు, సూట్ కేసులు, గొడుగులు, గోడ గడియారాలు, వాచ్‌లు వంటి 26 రకాల వస్తువుల పంపిణీపై నిఘా పెట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

రవాణా, కొరియర్ సర్వీస్‌లపై నిఘా..

అనుమానాస్పద వస్తువులను పట్టుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేకంగా తనిఖీ బృందాలను నియమించింది. రైల్వే పార్శిల్ కార్యాలయాలు, ట్రాన్స్‌పోర్టు గోడౌన్లు, ప్రైవేటు బస్సులు, పార్శిల్ కేంద్రాలు, కొరియర్ సర్వీస్ కేంద్రాలు తదితర రవాణా, నిల్వ కేంద్రాలపై ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నాయకులు రవాణా చేస్తున్న, నిల్వ చేసిన కోట్లాది రూపాయల విలువైన వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఆ వ్యయం అభ్యర్థుల ఖర్చులో జమ..

ఎన్నికల వేళ తాయిలాల పంపకాలు చేయాలంటే వస్తువులను గ్రామాలకు తరలించాలి. వ్యాపారుల పేరుతో వచ్చే వస్తువులు ఏంటీ, వాటిపై రాజకీయ ముద్రలు గానీ లేదా బిల్లులు లేకుండా వస్తున్నవి ఏమైనా ఉన్నాయా అని పోలీసులు, వాణిజ్య పన్నుల శాఖ ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ప్రలోభ పెట్టు వస్తువులపై పార్టీలకు చెందిన స్టిక్కర్లు, నాయకుల బొమ్మలు ఉన్నట్లయితే వాటి కొనుగోలు బిల్లులతో సరఫరా చేస్తూ పట్టుబడితే వాటిని ఆయా నాయకుల పేరుతో ఎన్నికల ఖర్చులో జమ చేస్తారు. ఎన్నికలు పూర్తయ్యాక స్వాధీనం చేసుకున్న ఆయా వస్తువుల విలువపై జీఎస్టీ చెల్లించిన తర్వాత విడుదల చేస్తారు.

సీఎం కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని ప్రొద్దుటూరు, టంగుటూరు, కొజ్జగూడ, ఎల్వర్తి, చందిప్ప, ఏర్వగూడ, మాసానిగూడ, కొత్తపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడోసారి ఓటు వేసి తనను అసెంబ్లీకి పంపించాలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశమూనికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే పేదలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు ఏనుగు నర్సింహారెడ్డి, గోపాల్, శ్రీనివాస్, శ్రీకాంత్, శాంత, ఎంపీటీసీ సభ్యులు ప్రవళిక, వెంకట్‌రెడ్డి, శోభా, దయాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, గుడిమల్కాపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహ, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్వర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే

బీఆర్‌ఎస్ షాద్‌నగర్ అభ్యర్థి అంజయ్య యాదవ్

నందిగామ: రాష్ట్ర అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే అని బీఆర్‌ఎస్ షాద్‌నగర్ అభ్యర్థి అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మండలకేంద్రంతో పాటుగా చంద్రాయన్‌గూడ, పిట్టల గూడ, రంగాపూర్, చాకలిగుట్ట తండా, సత్యేంద్రియా గూడ, మేకగూడ తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనా దక్షతతో రాష్ట్రం అన్నిరంగాల్లో దూసుకుపోతోతందన్నారు. సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు చేపట్టారని వివరించారు. రాష్ట్రం ఏర్పడితే భూముల ధరలు పడిపోతాయని చెప్పిన ప్రచారం చేసిన నాయకులు సమాధానం చెప్పాలన్నారు. రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్, రైతు బంధు, బీమా, కల్యాణలక్ష్మి ట షాదీ ముబారక్, కేసీఆర్ కిట్టు తదితర పథకాలను అమలు చేస్తున్నాడన్నారు. ఈ ఎన్నికలలో మూడో సారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఇతర పార్టీల నుంచి చేరికలు

ప్రచారంలో భాగంగా నందిగామలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్య అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాకప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి సుభాష్ రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, రమేశ్, రాజు నాయక్, అశోక్, పీఏసీఎస్ చైర్మన్ మంజుల రెడ్డి, రాజ్‌గోపాల్, మాజీ చైర్మన్ విఠల్, పార్టీ మండల అధ్యక్షుడు పద్మారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ రాజు నాయక్, నాయకులు శ్రీశైలం, హనుమంత్ రావు, శ్రీనివాస్ రెడ్డి, గోవు రవికుమార్, గబ్రూనాయక్, కిషన్ నాయక్, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.



నందిగామలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అంజయ్య యాదవ్

యువత పోలింగ్ శాతం పెంచాలి

మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్

మీర్‌పేట: యువత బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకుని పోలింగ్ శాతాన్ని పెంచాలని బీజేపీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా శ్రీరాములు ఆదివారం ఆయన మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో పాదయాత్ర చేసి ఓటు అభ్యర్థించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డబుల్ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం మహిళలు ప్రభుత్వానికి ఎదురుతిరిగారని.. బీఆర్‌ఎస్ అభ్యర్థిని గ్రామాల్లోకి రానిచ్చే పరిస్థితి లేదన్నారు. ఆడపడుచులంతా తనను ఆశీర్వదించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలను భారంగా మారిన పన్నులు, నల్లా బిల్లులను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలన అధికారి నియామకం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అసెంబ్లీ–51 సాధారణ ఎన్నికల పరిశీలన అధికారిగా తైతులంగ్ పమేయను కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించినట్లు రాజేంద్రనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇ. మల్లయ్య ప్రకటించారు. ఇప్పటి వరకు పరిశీలన అధికారిగా శిల్పా గుప్తా ఉండగా.. ఆమె స్థానంలో తైతులంగ్ పమేయను నియమించిందన్నారు. ఎన్నికల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులకు సందేహాలు, ఫిర్యాదులు ఉంటే ఎన్నికల సాధారణ పరిశీలన అధికారి తైతులంగ్ పమేయ (9030181777)కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బోసిపోయిన రోడ్లు

రాజేంద్రనగర్: వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రోడ్లన్నీ బోసిపోయి కనిపించాయి. ప్రతిరోజు రద్దీగా ఉండే ప్రధాన రహదారులు సైతం అడపాదడప వాహనాలతో కనిపించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రాఫిక్ జామ్‌లతో ఉన్న ఆరాంఘర్ చౌరస్తా, హైదర్‌గూడ, అత్తాపూర్, కాటేదాన్, ఉడెంగడ్డ, గగన్‌పహాడ్, రాజేంద్రనగర్ రహదారులు మ్యాచ్ ప్రారంభమై అనంతరం బోసిపోయి కనిపించాయి.

'కారు'తోనే 'పట్నం'లో వెలుగులు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



పోల్కంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్‌తోనే నియోజకవర్గంలో వెలుగులు నిండాయని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని పోల్కంపల్లి, నాగన్‌పల్లి, ఎన్గల్‌గూడ, జాజోనిబావి, మన్నెగూడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. పోల్కంపల్లి నుంచి అనాజ్‌పూర్ వరకు పెద్ద రోడ్డు వేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. నిరుపేదల సంక్షేమం అభివృద్ధికోసం పాటుపడుతున్న పార్టీకే ఓటు వేయాలని కోరారు. ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి సూమరు 1200 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు పేదలకు సహకరించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు మోసం చేసేందుకు యత్నిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండి కారు గుర్తుకు ఓటేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు మంగ, ఎంపీపీ కృపేష్, సర్పంచ్ ఆండాలు, పీఏసీఎస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, నర్సింహ, బాలు, చందు తదితరులు పాల్గొన్నారు.

రూ.97.30 లక్షల నగదు పట్టివేత




పంజగుట్ట: ఎలాంటి పత్రాలు లేకుండా కారులో భారీగా నగదు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బోడుప్పల్‌లో నివసించే మండ అనిల్ గౌడ్ (31), మహబూబ్‌నగర్ జిల్లా మేడిపల్లికి చెందిన ఏర్పుల రవి (35) కారు డ్రైవర్లు. వీరిద్దరు కలిసి ఆదివారం ఉదయం ఏపీ28సీఏ1169 ఇన్నోవా కారులో వెళ్తుండగా..బేగంపేట, గ్రీన్‌ల్యాండ్స్ సిగ్నల్‌వద్ద నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. కారులో ఉన్న బ్యాగ్‌లో రూ.97.30 లక్షల నగదును గుర్తించారు. వాటికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. ఒక సివిల్ కాంట్రాక్టర్ వద్ద కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నానని, తన యజమాని మరో బిల్డర్‌కు ఇవ్వమని పంపితే తీసుకువెళ్తున్నానని అనిల్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యం

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

ఇబ్రహీంపట్నం: తాము అధికారంలోకి రాగానే అధికారంలోకి రాగానే విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. ఆదివారం ఆయన పార్టీ అభ్యర్థి తులసిగారి రవీందర్‌కు మద్దతుగా ఇబ్రహీంపట్నంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 119 నియోజకవర్గాల్లో 102 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకే టికెట్లు కేటాయించామన్నారు. జనాభాలో పది శాతం ఉన్న రెడ్డి, వెలమ కులస్తులే రాజ్యాధికారం అనుభవిస్తున్నారని.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రవీందర్‌ను ఓడించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

చీకటి నేరాలపై నిఘా!

- మాఫియాలూ విజృంభించే సమయం
- హుండీ, హవాలా దందాలపై డేగ కన్నేయండి
- అధీకృత సంస్థల లావాదేవీలూ పరిశీలించండి
- ఫేక్ కరెన్సీ ముఠాలపై నిఘా ముమ్మరం చేయండి
- నకిలీ మద్యం, సైబర్ నేరాలూ విజృంభించే ప్రమాదం
- ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తం చేసిన ఉన్నతాధికారులు

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో బందోబస్తులు, పని ఒత్తిడి మాత్రమే కాదు... తెరపైకి కనిపించని సమస్యలు మరెన్నో ఉంటున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో గతానికి భిన్నంగా వ్యయం భారీగా పెరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటన్నింటికీ మించి ఆందోళనకర కోణాలు ఉండచ్చని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. ధనం, మద్యం ప్రవాహాలతో పాటు వీటితో ముడిపడిన మాఫియాలు సైతం విజృంభించే ప్రమాదం ఉందని, ఏమరుపాటుకు తావివ్వద్దని సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. వీటిపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రెండు దేశాల మధ్య జరిగే అక్రమ ద్రవ్య మార్పిడిని హవాలా, ఓ దేశంలోని వివిధ ప్రాంతాల మార్పిడిని హుండీ అంటారు. సాధారణంగా ఈ రెండు రకాలైన మార్గాలను పన్ను ఎగ్గొట్టేందుకు వ్యాపారస్థులు వినియోగిస్తుంటారు. ఎన్నికల సీజన్‌లో పార్టీలు, అభ్యర్థులు తమ అనధికారిక ఖర్చుల కోసం వీటినే ఆశ్రయిస్తాయని అనుమానిస్తున్నారు. ఈ రెండింటితో పాటు అవసరమైతే అధీకృత మార్పిడిదారుల లావాదేవీలనూ నిశితంగా పరిశీలించాల్సిందిగా అధికార వర్గాలు స్పష్టం చేశాయి. భారత ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్‌ఐతో పాటు అనేక ఉగ్రవాద సంస్థలూ నకిలీ నోట్లను ముద్రిస్తున్నాయి. వీటిని ఎక్కడికక్కడ స్థానికంగా ఏర్పాటు చేసుకున్న ముఠాల సాయంతో బంగ్లాదేశ్ మీదుగా పశ్చిమ బెంగాల్‌కు చేర్చి అక్కడ నుంచి వివిధ నగరాలు, పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. 'ఎన్నికల ఖర్చుల'కు అవసరమైన డబ్బు కోసం అనేక మార్గాలను అన్వేషించే వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఫేక్ కరెన్సీని భారీ స్థాయిలో చెలామణి చేయడానికి ముఠాలు ప్రయత్నిస్తాయని అనుమానిస్తున్నారు. ఈ సమస్య ఇటీవల చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గిపోయినా... ఎన్నికల సీజన్‌లో పెరగవచ్చని సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఇప్పటికే ఈ నేరం చేస్తున్న గ్యాంగ్‌లకు తోడు డిమాండ్ ఆధారంగా కొత్తవీ పుట్టుకు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దుబాయ్ కేంద్రంగా జరిగే హవాలా వ్యవహారంలో ప్రతి ముఠాకూ రెండు చోట్లా ఏజెంట్లు ఉంటారు. నగదు పంపాల్సిన వారు దుబాయ్‌లో ఉన్న ఏజెంట్‌ను డబ్బును అందిస్తే... అతడి ద్వారా సమాచారం అందుకునే భారత్‌లోని ఏజెంట్ ఆ మొత్తాన్ని ఇక్కడ డెలివరీ చేస్తాడు. తాజాగా ఈ పంథా మారింది. దుబాయ్‌లో వ్యక్తుల నుంచి ఏజెంట్లు తీసుకున్న డబ్బు అక్కడున్న దుబాయ్ మాడ్యూల్‌తో పాటు పాకిస్థాన్‌లోని ప్రధాన సూత్రధారులు పంచుకుంటున్నారు. ఇక్కడ డెలివరీ చేయడానికి మాత్రం ఉత్తరాదిలో ఏర్పాటు చేసుకున్న ముఠాలతో సైబర్ నేరాలు చేయించి ఆ మొత్తాన్ని ఇక్కడ డెలివరీకి వినియోగిస్తున్నారు. ఇలాంటి ముఠాలు విశృంఖలంగా పంజా విసురుతాయని అధికారులు అనుమానిస్తున్నారు. ఓటర్లను ప్రలోభపరచడానికి మద్యాన్నీ భారీగా వినియోగిస్తుంటారు. ఖర్చుల లెక్కల్లో చూపించకుండా ఉండేందుకు అభ్యర్థులు అనేక మార్గాల్లో మద్యాన్ని కొనుగోలు చేయడానికి వెనుకాడరు. దీన్ని అదునుగా చేసుకుని నకిలీ మద్యం మాఫియా కూడా రెచ్చిపోతుందనేది ఉన్నతాధికారుల అంచనా. మిగిలిన మాఫియాల ప్రభావం నేరుగా ప్రజలపై లేకున్నా... నకిలీ మద్యం వల్ల మాత్రం తీవ్ర దుష్పరిణామాలు వెంటనే ప్రతిఫలిస్తాయని స్పష్టం చేస్తున్నారు.